# పెన్ పవర్
## తెలంగాణ రౌండప్
శుక్రవారం 17 అక్టోబర్ 2025 పేజీలు 8


# అమీర్‌పేట వరద కష్టాలకు చెక్...
# హైడ్రా ప్రత్యేక ఆపరేషన్!

- అమీర్‌పేట వరద సమస్యకు హైడ్రా పరిష్కారం
- పూడుకుపోయిన నాలాలను శుభ్రం చేసే పనుల పరిశీలన
- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ క్షేత్రస్థాయి పర్యటన
- ఇప్పటివరకు 45 ట్రక్కుల పూడిక తొలగింపు
- నగరమంతా ఇదే విధానం అమలు చేయాలని సూచన
- 10 సెం.మీ వర్షం కురిసినా తప్పిన ముంపు ముప్పు



**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ నగరంలోని అమీర్‌పేట వాసులకు ఏళ్లుగా వర్షాకాలంలో ఎదురయ్యే వరద కష్టాలకు ఈ ఏడాది తెరపడింది. హైదరాబాద్ రెయిన్‌వాటర్ డ్రైనేజీ అడ్మినిస్ట్రేషన్ (హైడ్రా) చేపట్టిన నాలాల పూడికతీత పనులు సత్ఫలితాలనిచ్చాయి. ఈ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం అమీర్‌పేటలో పర్యటించి, జరుగుతున్న పనులను పరిశీలించారు. జూబ్లీహిల్స్, యూసుఫ్‌గూడ, మధురానగర్ వంటి ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు అమీర్‌పేట వద్ద నిలిచిపోవడంతో

-2 లో

# లోకల్ బాడీ ఎలక్షన్లలో ఇద్దరు పిల్లల రూల్ తొలగింపు

## తెలంగాణ కేబినెట్ నిర్ణయాలు ఇవే





- స్థానిక ఎన్నికల్లో పోటీకి ఇద్దరు పిల్లల నిబంధనపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
- ముగ్గురు పిల్లలు ఉంటే పోటీకి అనర్హులు అనే నిబంధన తొలగించి చట్టాన్ని మార్చేందుకు ఆమోదం
- ఇద్దరు పిల్లల నిబంధన తొలగించాలని మంత్రివర్గం నిర్ణయం
- రాష్ట్రంలో కొత్తగా మూడు వ్యవసాయ కళాశాలల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం

**హైదరాబాద్ పెన్ పవర్:**స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి ఇద్దరు పిల్లలు నిబంధనపై తెలంగాణ మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ముగ్గురు పిల్లలు ఉంటే పోటీకి అనర్హులనే నిబంధనను తొలగించి, చట్టాన్ని మార్చేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో ముగ్గురు పిల్లలు ఉన్నవారు కూడా పోటీకి అర్హులవుతారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో మంత్రివర్గ సమావేశం జరిగింది. సమావేశం వివరాలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియాకు తెలిపారు. పలు రంగాలకు భూకేటాయింపులు జరిపేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని అన్నారు. మద్దతు ధరతో పాటు సన్నవడ్లకు బోనస్ కూడా ఇస్తామని తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా మూడు వ్యవసాయ కళాశాలల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపిందని అన్నారు. నల్సార్‌లో స్థానిక విద్యార్థులకు 50 శాతం సీట్లు ఇవ్వాలని కేబినెట్ తీర్మానం చేసిందని అన్నారు.

-2 లో

# దోశలేస్తూ.. అరటిపండ్లు అమ్ముతూ.. మల్లారెడ్డి ఎన్నికల ప్రచారం..

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో మాజీ మంత్రి మల్లారెడ్డి
- బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు మద్దతుగా వినూత్న రీతిలో ప్రచారం
- సాధారణ ప్రచారానికి భిన్నంగా జనంలోకి వెళ్తున్న మల్లారెడ్డి

హైదరాబాద్ పెన్ పవర్:జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నిక ప్రచారంతో హోరెత్తుతోంది. విజయమే లక్ష్యంగా అన్ని పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి తనదైన శైలిలో ప్రచార బరిలోకి దిగి అందరి

-2 లో



# ఫాంహౌస్‌లో రేవ్ పార్టీ.. మహిళలతో నృత్యాలు



- ఓ వ్యాపారి ఆధ్వర్యంలో నిర్వహణ
- పాల్గొన్న రాజకీయ నాయకులు, రియల్టర్లు
- నిందితుల అరెస్టు.. స్టేషన్ బెయిలుపై విడుదల

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ శివారులోని ఓ ఫామ్‌హౌస్‌లో రేవ్ పార్టీ వ్యవహారం కలకలం రేపింది. భారాస నాంపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చందపేట ఆనంద్‌కుమార్‌గౌడ్, మాజీ మంత్రి ముఖేశ్‌గౌడ్ సోదరుడు, గన్‌ఫౌండ్రీ మాజీ కార్పొరేటర్ మధుగౌడ్, రియల్టర్లు, కాంట్రాక్టర్లు, వ్యాపారులు తదితరులు పాల్గొన్న పార్టీని రంగారెడ్డి జిల్లా మంచాల పోలీసులు బుధవారం అర్ధరాత్రి భగ్నం చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొచ్చిన మహిళలతో నృత్యాలు చేయిస్తూ వీరంతా మద్యం తాగుతుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మంచాల మండలం లింగంపల్లి శివారులోని ఫాంహౌస్‌లో జరిగిన ఈ పార్టీలో మొత్తం 25 మంది పురుషులు, 8 మంది మహిళలు పాల్గొన్నారు. నిందితుల నుంచి


-2 లో

# హైదరాబాద్‌లోని దూలపల్లి పారిశ్రామికవాడలో భారీ అగ్ని ప్రమాదం

- కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పారిశ్రామికవాడలో అగ్ని ప్రమాదం
- ప్లాస్టిక్ కవర్లు తయారు చేసే పాలిమర్ పరిశ్రమలో ప్రమాదం
- రెండు ఫైరింజన్లతో మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నం

**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ నగరంలోని దూలపల్లి పారిశ్రామిక వాడలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పారిశ్రామికవాడలోని ప్లాస్టిక్ కవర్ల తయారీ పరిశ్రమలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పాలిమర్

-2 లో



## దోశలేస్తూ.. అరటిపండ్లు అమ్ముతూ.. మల్లారెడ్డి ఎన్నికల ప్రచారం..

- మొదటి పేజి తరువాయి

దృష్టినీ ఆకర్షిస్తున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు మద్దతుగా ఆయన చేపట్టిన వినూత్న ప్రచార విధానం స్థానికంగా ఆసక్తి రేపుతోంది. రొటీన్ ప్రసంగాలు, సభలకు భిన్నంగా ఆయన నేరుగా జనంలోకి వెళ్లి వారి పనుల్లో పాలుపంచుకుంటున్నారు.ప్రచారంలో భాగంగా ఈరోజు జూబ్లీహిల్స్‌లోని ఓ టిఫిన్ సెంటర్‌లోకి అకస్మాత్తుగా వెళ్లిన మల్లారెడ్డి, అక్కడున్న వారిని ఆశ్చర్యపరిచారు. వెంటనే గరిటె చేతపట్టి, స్వయంగా పెనంపై దోశలు వేయడం ప్రారంభించారు. అక్కడికి వచ్చిన వారికి దోశలు అందిస్తూ, మాగంటి సునీతకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆయన తీరుతో అక్కడి వాతావరణం సందడిగా మారింది.అంతటితో ఆగకుండా, సమీపంలోని ఓ అరటి పండ్ల బండి వద్దకు వెళ్లి కొద్దిసేపు వ్యాపారిగా మారిపోయారు. అటుగా వెళ్తున్న వారికి అరటి పండ్లు అమ్ముతూ, ఓటర్లతో సరదాగా ముచ్చటించారు. సామాన్య ప్రజల జీవన విధానంలో భాగమై వారిని ఆకట్టుకునేందుకు మల్లారెడ్డి చేస్తున్న ఈ ప్రయత్నం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. సంప్రదాయ రాజకీయ ప్రచారాలకు స్వస్తి పలికి, ప్రజలతో నేరుగా మమేకమయ్యే ఈ కొత్త పంథా ఓటర్లపై ఎలాంటి ప్రభావం చూపుతుందోనని రాజకీయ వర్గాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి.

## లోకల్ బాడీ ఎలక్షన్లలో ఇద్దరు పిల్లల రూల్ తొలగింపు: తెలంగాణ కేబినెట్ నిర్ణయాలు ఇవే

- మొదటి పేజి తరువాయి

నల్సార్ యూనివర్సిటీకి గతంలో ఇచ్చిన దానికంటే అదనంగా 7 ఎకరాలు ఇస్తామని, రైతులు పండించిన ధాన్యం మొత్తం కొనుగోలు చేయాలని నిర్ణయించామని తెలిపారు.కేంద్రం కొనుగోలు చేసినా చేయకపోయినా తమ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజాపాలనకు రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఉత్సవాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఇందుకు సంబంధించి కేబినెట్ సబ్ కమిటీని వేశామని అన్నారు. మెట్రో రెండో దశను క్షుణ్ణంగా పరిశీలించేందుకు సీఎస్ ఛైర్మన్‌గా కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## హైదరాబాద్‌లోని దూలపల్లి పారిశ్రామికవాడలో భారీ అగ్ని ప్రమాదం

- మొదటి పేజి తరువాయి

పరిశ్రమ నుంచి పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడుతున్నాయి. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. రెండు అగ్నిమాపక యంత్రాల సిబ్బంది మంటలను ఆర్పడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ ఘటనపై పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అమీర్‌పేట వరద కష్టాలకు చెక్... హైడ్రా ప్రత్యేక ఆపరేషన్!

- మొదటి పేజి తరువాయి

ఏటా ప్రధాన రహదారి నడుం లోతు నీటిలో మునిగిపోయేది. దశాబ్దాలుగా పేరుకుపోయిన చెత్త, మట్టి, పరుపులు, దిండ్లతో ఇక్కడి 6 ప్రధాన పైపులైన్లు పూర్తిగా మూసుకుపోవడమే దీనికి కారణమని అధికారులు గుర్తించారు. హైడ్రా, జీహెచ్ఎంసీ, జలమండలి, ఇరిగేషన్ విభాగాల సమన్వయంతో ఈ పూడికతీత పనులను చేపట్టారు. ఇప్పటివరకు 45 ట్రక్కుల పూడికను తొలగించినట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ.. అమీర్‌పేటలో అనుసరించిన విధానం నగరంలోని అనేక ముంపు ప్రాంతాలకు ఒక నమూనా అని తెలిపారు. ఇదే మాదిరిగా నగరవ్యాప్తంగా కల్వర్టులు, పైపులైన్లలో పూడిక తొలగిస్తే వరద సమస్యను చాలా వరకు అధిగమించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. గాయత్రీ నగర్ ప్రాంతంలో మిగిలిన పైపులైన్ల పనులను కూడా వేగంగా పూర్తి చేసి, వచ్చే వర్షాకాలానికి ముంపు సమస్య పునరావృతం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.ప్రస్తుతం 3 పైపులైన్లు అందుబాటులోకి రావడంతో ఈసారి 10 సెంటీమీటర్ల వర్షం పడినా నీరు నిలవలేదని అధికారులు కమిషనర్‌కు వివరించారు. మిగిలిన 3 లైన్ల పనులు కూడా పూర్తయితే 15 సెంటీమీటర్ల వర్షపాతాన్ని కూడా తట్టుకునే సామర్థ్యం వస్తుందని వారు తెలిపారు. హైడ్రా చేపట్టిన పనులపై స్థానిక కాలనీ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేసి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఫాంహౌస్‌లో రేవ్ పార్టీ.. మహిళలతో నృత్యాలు

- మొదటి పేజి తరువాయి

రూ.2.45 లక్షలు, 25 ఫోన్లు, 11 కార్లు, 27 మద్యం సీసాలు, స్పీకర్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఇతర రాష్ట్రాల నుంచి అమ్మాయిలు కాచిగూడకు చెందిన వ్యాపారి రుద్రశెట్టి సప్తగిరి (49) తన ఫాంహౌస్‌లో స్నేహితులతో కలిసి రేవ్‌పార్టీ ఏర్పాటు చేశాడు. నృత్యాల కోసం ముంబయి, పశ్చిమబెంగాల్, ఏపీలోని గాజువాక ప్రాంతాలకు చెందిన ఎనిమిది మంది మహిళల్ని పిలిపించాడు. బుధవారం సాయంత్రం రేవ్ పార్టీ మొదలవ్వగా.. సప్తగిరి స్నేహితులైన చందపేట ఆనంద్‌కుమార్‌గౌడ్ (63), మాజీ కార్పొరేటర్ మధుగౌడ్ (57) సహా వివిధ ప్రాంతాలకు చెందిన 24 మందిని ఆహ్వానించాడు. అర్ధరాత్రి వేళ భారీ శబ్దాలతో రేవ్ పార్టీ జరుగుతున్నట్లు తెలిసి పోలీసులు అక్కడికి వెళ్లారు. ఆ సమయంలో పురుషులు మద్యం తాగుతుండగా.. మహిళలు నృత్యాలు చేస్తున్నారు.

మహిళా డ్యాన్సర్లు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున ఇచ్చి రప్పించినట్లు పోలీసుల విచారణలో తేలింది. మద్యం వినియోగానికి అనుమతులు తీసుకోలేదు. అందరినీ పోలీసులు అరెస్టు చేసి.. స్టేషన్‌బెయిల్‌పై విడిచిపెట్టారు.

# సామాజిక మాధ్యమాల్లో ఫేమస్ అయ్యేందుకు చిన్నారులతో అసభ్యకర కంటెంట్.. తీవ్రంగా స్పందించిన సజ్జనార్

**హైదరాబాద్ పెన్ పవర్:**వ్యూస్ వ్యామోహంలో విలువలు విస్మరిస్తే ఎలాగని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ప్రశ్నించారు. కేవలం వ్యూస్, లైక్స్ కోసం సామాజిక మాధ్యమాల్లో ప్రాచుర్యం పొందడానికి చిన్నారుల భవిష్యత్తును పణంగా పెట్టడం సముచితం కాదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని యూట్యూబ్ ఛానళ్లు పిల్లలతో నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలను ఉద్దేశించి ఆయన 'ఎక్స్' వేదికగా తన అభిప్రాయాన్ని వెల్లడించారు.చిన్నారులతో అసభ్యకరమైన కంటెంట్ సృష్టిస్తూ సమాజానికి ఎటువంటి సందేశాన్ని ఇస్తున్నారని ఆయన ప్రశ్నించారు. చిన్నారులు, యువతకు స్ఫూర్తినిచ్చే, ఆదర్శంగా నిలిచే వ్యక్తులను ఇంటర్వ్యూ చేసి సమాజాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. పిల్లలతో ఇష్టానుసారంగా వీడియోలు చేసి వారిని తప్పుదోవ పట్టించవద్దని హితవు పలికారు. ఇటువంటి చర్యలు పోక్సో, జువైనల్ చట్టాల ఉల్లంఘన కిందకే వస్తాయని, ఇది పిల్లలను వేధించినట్టు అవుతుందని ఆయన అన్నారు.మైనర్లతో సహా ఈ తరహా కంటెంట్ సృష్టించి వారి పట్ల పోలీస్ శాఖ కఠినంగా



వ్యవహరిస్తుందని ఆయన స్పష్టం చేశారు. బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లలతో రూపొందించే అసభ్యకరమైన కంటెంట్‌ను వెంటనే తొలగించాలని, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకూడదని ఆయన తేల్చి చెప్పారు.అలా జరగని పక్షంలో చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో ఇటువంటి వీడియోలు కనిపిస్తే వెంటనే రిపోర్టు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పిల్లలను పెంచడంతో పాటు వారి బాల్యం, మానసిక ఆరోగ్యం, భవిష్యత్తును కాపాడటం కూడా తల్లిదండ్రుల బాధ్యత అని ఆయన గుర్తు చేశారు.

# హత్య కేసులో నిందితుల అరెస్టు

**కరీంనగర్: పెన్ పవర్:**కరీంనగర్- టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన అనుమానాస్పద మరణం కేసును పోలీసులు హత్యగా నిర్ధారించారు. ఆరుగురు నిందితులను కరీంనగర్ టూ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు.

మృతుడు కత్తి సురేష్ భార్య కత్తి మౌనిక (ఏ 1) ఐదుగురు నిందితులు ఈ హత్యకు కుట్ర పన్నినట్లు దర్యాప్తులో తేలిందని సీపీ గౌస్ అలం వెల్లడించారుద. 2015లో ప్రేమ వివాహం చేసుకున్న సురేష్, మౌనికలకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. సుమారు తొమ్మిది నెలల క్రితం, మౌనిక సెక్స్ వర్కర్ వృత్తిలో ప్రవేశించింది. ఈ క్రమంలో, ఆమెకు ఏ -4 దొమ్మాటి అజయ్తో పరిచయం ఏర్పడి అక్రమ సంబంధం కొనసాగించింది. అజయ్ సూచన మేరకు, భర్త తరచుగా డబ్బు కోసం వేధించడం భరించలేక, మౌనిక అతడిని అంతమొందించాలని నిర్ణయించుకుంది.

తన బంధువు, సహ-సెక్స్ వర్కర్ అయిన ఏ-2 అరిగే శ్రీజతో ఈ విషయాన్ని చర్చించింది. ఏ-2, ఏ-3 పోతు శివ కృష్ణ ( మెడికల్ ఏజెన్సీ యజమాని). సహ-సెక్స్ వర్కర్ అయిన ఏ-5 వేముల రాధ అలియాస్ నల్ల సంధ్యని మౌనికకు పరిచయం చేసింది. వీరంతా కలిసి సురేష్ను చంపడానికి ఒక ప్రణాళికను రూపొందించారు.

మృతుడు సురేష్ మద్యం సేవిస్తున్న సమయంలో, భార్య కొన్ని రకాల మందులను చూర్ణం చేసి అతని పానీయంలో కలిపింది. దీని ప్రభావంతో సురేష్ అపస్మారక స్థితిలోకి వెళ్ళిపోయాడు. తరువాత, మౌనిక ఒక చీరను ఉపయోగించి కిటికీ గ్రిల్కు కట్టి, దానిని సురేష్ మెడకు చుట్టి గట్టిగా లాగి, ఉరేసింది. సురేష్ మరణాన్ని నిర్ధారించుకున్న తర్వాత, ఏ-1 తన అత్త మామలకు ఫోన్ చేసి, లైంగిక చర్య సమయంలో తన భర్త స్పృహ కోల్పోయాడని తప్పుదోవ పట్టించింది. కుటుంబ సభ్యులు అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు అప్పటికే మరణించినట్లు ప్రకటించారు.దర్యాప్తులో, శాస్త్రీయ మరియు సందర్భోచిత ఆధారాల ద్వారా ఇది హత్య అని మరియు నిందితులు కుట్ర పన్నారని స్పష్టమైంది. మొత్తం ఆరుగురు నిందితులను అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు.

# ప్రభుత్వ కొనసాగింపుతో ఏపి నెం.1 కావడం గ్యారంటీ

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ అన్నా, ఇక్కడి ప్రజలు అన్నా ప్రధాని మోడీజీకి అపారమైన ప్రేమ. 16నెలల్లో నాలుగుసార్లు రాష్ట్రానికి వచ్చారు, మనం అడిగిన అన్ని కోరికలు తీరుస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో నంబర్ 1 కావాలంటే ప్రభుత్వ కొనసాగింపు చాలా అవసరం. గుజరాత్ లో ప్రభుత్వ కొనసాగింపు వల్లే ఆ రాష్ట్రం అభివృద్ధి చెందిందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ వేడుకల్లో భాగంగా కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం నన్నూరు చెక్ పోస్టు సమీపంలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోడీ ముఖ్యఅతిథిగా హాజరుకాగా, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... స్థిరమైన అభివృద్ధి సాధించాలంటే ప్రభుత్వ కొనసాగింపు అనేది ముఖ్యం. ప్రధాని నరేంద్ర మోడీ వరుసగా మూడుసార్లు ప్రధాని కావడం వల్లే ప్రపంచంలో 10నుంచి 4వ అతి పెద్ద ఎకానమీగా అభివృద్ధి చెందింది. సంక్షేమం - అభివృద్ధి ప్రజా ప్రభుత్వానికి జోడెద్దుల బండి లాంటివి, కూటమి ప్రభుత్వాన్ని కొనసాగిస్తే ఏపీ అన్ని రంగాల్లో నంబర్ 1 కావడం గ్యారంటీ. పవర్ ఫుల్ పీపుల్ మేక్స్ పవర్ ప్లేసెస్. పౌరుషాల గడ్డ ఉమ్మడి కర్నూలు జిల్లా. బ్రిటిష్ వాళ్ళను గడగడ లాడించిన ఉయ్యాలవాడ నరసింహ రెడ్డి గారు, ముత్తుకూరు గౌడప్ప గారు జన్మించిన గొప్ప నేల ఉమ్మడి కర్నూలు జిల్లా. కర్నూలు జిల్లా ప్రజల రాజసం కొండారెడ్డి బురుజు.సూపర్ జీఎస్టీ %-% సూపర్ సేవింగ్స్ తో దసరా, దీపావళి కలిపి ఒకేసారి వచ్చినట్లుగా ఉంది. అలాంటి సూపర్ పండుగను 140 కోట్ల ప్రజలకు అందించారు మన ప్రధాని నమో. పేద, మధ్య తరగతి ప్రజల పై పన్నుల భారం తగ్గించారు. ట్యాక్స్ తగ్గడం వలన ఒక్కో పేద, మధ్య తరగతి కుటుంబానికి ఏడాదికి 15 వేలు మిగులుతుంది. జీఎస్టి తగ్గించాలని నిర్ణయం తీసుకున్నప్పుడు అధికారులు ప్రభుత్వానికి వేల కోట్ల నష్టం వస్తుందని చెప్పారు. ప్రభుత్వానికి నష్టం వచ్చినా పర్వాలేదు దేశానికి లాభం జరుగుతుందని నమో అన్నారు. నిత్యావసరాలు, విద్య, వైద్యం, వ్యవసాయం... ఇలా పేద, మధ్య తరగతి ప్రజలు ఉపయోగించే ప్రతి వస్తువు పై జీఎస్టీ తగ్గించారు. జీఎస్టీ తగ్గడంతో ప్రజలు పండగ చేసుకుంటున్నారు. పేద ప్రజల చిరునవ్వే మన నమో కి పండగ. పేద ప్రజల ఆనందమే మన నమో కి పండగ. పేదరికం లేని దేశమే మన నమో కల. జీఎస్టి తగ్గించాలని ప్రధాని నిర్ణయం తీసుకున్న తరువాత మన ఫైనాన్స్ మంత్రి కేశవ్ వచ్చి దాదాపు 8 వేల కోట్లు నష్టపోతామని ముఖ్యమంత్రి చంద్రబాబు కి చెప్పారు. ప్రభుత్వానికి నష్టం వచ్చినా పర్వాలేదు ... పేద ప్రజలకు 8 వేల కోట్ల లాభం జరుగుతుంది కదా అని సిఎం అన్నారు. నమో ఏ నిర్ణయం తీసుకున్నా అది ప్రజల మంచి కోసమే, దానికి చంద్రబాబు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారు.కేంద్రం లో మన నమో ... రాష్ట్రంలో మన సిబిఎన్. ఇది డబుల్ ఇంజిన్ సర్కార్ కాదు డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్. ప్రధాని సహాయంతో విశాఖ ఉక్కు ను కాపాడుకున్నాం. విశాఖ లో రైల్వే జోన్ ఏర్పాటు చేసుకున్నాం. పోలవరం పనులు వేగవంతం అయ్యాయి. అమరావతి పనులు వేగంగా జరగడానికి, కర్నూలు లో హై కోర్టు బెంచ్ ఏర్పాటుకు సహకరిస్తున్నారు. ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ రాష్ట్రం లో ఏర్పాటు చెయ్యమని కంపెనీ వాళ్లను కోరినప్పుడు వాళ్లు మాకు మూడు అంశాల్లో క్లారిటీ కావాలని అడిగారు. వెంటనే మన ముఖ్యమంత్రి ప్రధానిని కలిసి చెప్పిన వెంటనే ఆయన దానికి అంగీకరించారు. నమో సహకారం వల్లే భారత్ లో అతి పెద్ద స్టీల్ ప్లాంట్ ఆంధ్రప్రదేశ్ కు వచ్చింది. గూగుల్, స్పేస్ సిటీ , డ్రోన్ సిటీ, కొప్పర్తి, ఓర్వకల్ ఇండస్ట్రియల్ నోడ్, బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు కేంద్రం సహకరిస్తోంది. దట్ ఈజ్ ద పవర్ ఆఫ్ డబుల్ ఇంజన్ బుల్లెట్ సర్కార్.

నమో అంటే విక్టరీ. ఆయన ఏ కార్యక్రమం ప్రారంభించినా విజయమే. గుజరాత్ ముఖ్యమంత్రిగా, భారత దేశానికి ప్రధానిగా నమో 25 ఏళ్ళు పూర్తి చేసుకున్నారు. కష్టపడి పనిచేయడానికి ప్రత్యామ్నాయం లేదు. 25 ఏళ్ల అధికారంలో ఉన్నా మన నమో మొదటి రోజు ఎంత కష్టపడ్డారో ఇప్పటికీ అంతే హార్డ్ వర్క్ చేస్తూనే ఉన్నారు. గుజరాత్ ను పవర్ ఫుల్ స్టేట్ గా మార్చారు. ఇప్పుడు భారత దేశాన్ని సూపర్ పవర్ గా మారుస్తున్నారు. గతంలో ఉగ్రవాద దాడులు జరిగినప్పుడు. మన దేశ ప్రభుత్వాలు యూఎన్ దగ్గరకో, ఇతర దేశాల దగ్గరకో వెళ్లి సాయం కోరేవారు. మన నమో రూటే సెపరేటు. పెహల్గావ్ లో నమో కొట్టిన దెబ్బకి పాకిస్థాన్ దిమ్మ తిరిగిపోయింది. అమెరికా ట్యాక్సులు పెంచితే పెద్ద పెద్ద దేశాలు కూడా వణికిపోయాయి. నమో ఆత్మనిర్భర్ భారత్ వంటి కార్యక్రమాలతో ధైర్యంగా ముందుకు సాగుతున్నారు. నమోకి దేశ ప్రజలు అంటే నమ్మకం.. మనకి నమో అంటే నమ్మకం. ఆ నమ్మకమే దేశాన్ని, రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తోందని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

### డిసిసి అధ్యక్షుడి ఎంపికపై రభస

## సమావేశం రసాభాస

**కరీంనగర్ జిల్లా పెన్ పవర్:**డిసిసి అధ్యక్షుడి ఎంపికపై కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ సమావేశం రసాభాసగా మారింది. పరిశీలకుల సమక్షంలో గ్రూపు రాజకీయాలు బహిర్గతం అయ్యాయి. డిసిసి అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణ, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు అనుచరులు మధ్య వాగ్వాదం జరిగింది. తోపులాటతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఆందోళనకు దిగిన వారిని బయటకు పంపించిన పరిశీలకులు అధ్యక్షుడి ఎంపికపై పార్టీ శ్రేణుల అభిప్రాయం తెలుసుకున్నారు.

## దేశ భద్రత, ప్రయోజనాలే అత్యంత ప్రాధాన్యత

**హైదరాబాద్ పెన్ పవర్:**రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఇకపై రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయదని.. ఈ మేరకు ప్రధాని మోదీ తనకు హామీ ఇచ్చారని ట్రంప్ చెప్పారు. ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై భారత్ తాజాగా స్పందించింది. దేశ భద్రత, ప్రయోజనాలే తమకు అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేసింది. ఇంధన దిగుమతుల విషయంలో తమ విధానాలు పూర్తిగా దేశీయ అవసరాల మేరకే ఉంటాయని పేర్కొంది. ఈ మేరకు కేంద్ర విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ ఓ ప్రకటన విడుదల చేశారు. 'భారత్ భారీ మొత్తంలో చమురు, గ్యాస్ దిగుమతి చేసుకుంటుంది. అంతర్జాతీయంగా ఇంధన ధరల్లో ఒడిదుడుకులు నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల్లో భారతీయ వినియోగదారుల ప్రయోజనాలను కాపాడటమే మా ప్రథమ ప్రాధాన్యత. మా దిగుమతి విధానాలు పూర్తిగా ఈ లక్ష్యం ఆధారంగానే ఉంటాయి. స్థిరమైన ఇంధన ధరలు, సురక్షితమైన సరఫరా.. ఈ రెండే మా ఇంధన విధానంలోని ప్రధాన లక్ష్యాలు. దీనికోసం మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఇంధన వనరులను విస్తృతం చేసుకుంటున్నాం' అని తెలిపారు.ఇక అమెరికా విషయానికొస్తే.. చాలా ఏళ్లుగా ఆ దేశం నుంచి ఇంధన సేకరణను పెంచేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. గత దశాబ్ద కాలంలో ఇది క్రమంగా పెరిగిందని ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత అమెరికా ప్రభుత్వం కూడా భారత్‌తో ఇంధన సహకారాన్ని పెంపొందించుకోవడంపై ఆసక్తి చూపుతోందని తెలిపారు. ఈ విషయంపై చర్చలు కొనసాగుతున్నాయని ఆయన వెల్లడించారు.

## బంద్ కు మద్దతుగా బీసీల ర్యాలీ

**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం ఈ వ్యవస్థలు బీసీలకు అనుకూలంగా మారాలని వారిపై ఒత్తిడి తీసుకురావడానికి ఒక పెద్ద ప్రజా ఉద్యమాన్ని అక్టోబర్ 18 న తీసుకురావడం జరిగిందని బీసీ సంఘాల జేఏసీ చైర్మన్ ఆర్ కృష్ణయ్య అన్నారు. ఈ మేరకు 42 శాతం బీసీ రిజర్వేషన్ల పై తలపెట్టిన బందుకు మద్దతుగా రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గవ్వల భరత్ కుమార్ ఆధ్వర్యంలో విద్యానగర్ నుండి గన్ పార్క్ వరకు కార్ల భారీ ఎత్తున ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ స్కాలర్ షిప్ ల విషయంలో కానీ,లోన్ ల విషయంలో కానీ బీసీలను చిన్నచూపు చూడడం జరుగుతుంది. అందువల్ల బీసీలకు సరైన గుర్తింపు రావాలంటే పెద్ద ఎత్తున పోరాటం చేయకపోతే అది సాధ్యం కాదు. అక్టోబర్ 18న తలపెట్టిన బందు రోజున ఒక్క స్కూల్ ,కాలేజీ, వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించి చరిత్రలో ఎన్నడూ జరగని విధంగా ఈ బంద్ ఉండాలన్నారు.అన్ని రాజకీయ పార్టీలు ఈ బందుకు మద్దతు తెలిపాయని అన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా బందు లో పాల్గొనే విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## డిసెంబర్ 5న ఏపిఎఫ్సి ఇండియా 1 మరియు డిసెంబర్ 21న బాక్సింగ్‌బే 4

**హైదరాబాద్ పెన్ పవర్:** భారతీయ నటుడు మరియు వ్యవస్థాపకుడు రానా దగ్గుబాటి సహ-ప్రమోట్ చేసిన బాక్సింగ్‌బే, మరియు మాజీ యుఎఫ్సి లైట్‌వెయిట్ ఛాంపియన్ ఆంథోనీ పెట్టిస్ నేతృత్వంలోని ఆంథోనీ పెట్టిస్ ఫైటింగ్ ఛాంపియన్‌షిప్ (ఏపిఎఫ్సి) ఇండియా, అల్టిమేట్ ఫైటింగ్ ఛాంపియన్‌షిప్ యొక్క అధికారిక యాప్ అయిన యుఎఫ్సి యాప్‌లో ప్రపంచవ్యాప్తంగా ప్రసారం చేసిన మొదటి భారతీయ పోరాట క్రీడా ఈవెంట్‌లుగా అవతరిస్తుంది మరియు యుఎఫ్సి యొక్క ప్రత్యేక స్ట్రీమింగ్ సర్వీస్ మరియు పోరాట క్రీడా అభిమానులకు ప్రీమియర్ గమ్యస్థానం అయిన యుఎఫ్సి ఫైట్ పాస్ కు నిలయం. ఈ మైలురాయి ప్రపంచవ్యాప్తంగా క్రీడ ఉనికికి కొత్త అధ్యాయాన్ని తెరుస్తుంది.డిసెంబర్ 5న ఏపిఎఫ్సి ఇండియా 1 మరియు డిసెంబర్ 21న బాక్సింగ్‌బే 4 ప్రసారం కానున్న ప్రారంభ ఈవెంట్‌లు, హైదరాబాద్, బెంగళూరు మరియు వైజాగ్ ప్రాథమిక ఆతిథ్య నగరాలుగా ఉన్నాయి. ఈ మైలురాయి భారతీయ పోరాట క్రీడలకు ఒక ముఖ్యమైన ముందడుగును సూచిస్తుంది, ప్రపంచ వేదికపై వారి ఉనికిని పెంచుతుంది.బాక్సింగ్‌బే మరియు ఏపిఎఫ్సి ఇండియా లైనప్ ప్రతి సంవత్సరం

38 ప్రపంచ పోరాట క్రీడా సంస్థల నుండి యుఎఫ్సి యాప్‌లో ప్రసారం చేయబడే 200ం మార్క్యూ ఈవెంట్‌ల జాబితాలో చేరింది, వీటిని ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది అభిమానులు మరియు కుటుంబాలు వీక్షిస్తున్నారు. ఈ భాగస్వామ్యం భారతీయ బాక్సర్లు మరియు ఎంఎంఏ యోధులు ప్రపంచ వేదికపై తమ ప్రతిభను ప్రదర్శించడానికి కొత్త అవకాశాలను సృష్టిస్తుంది.

# లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

**హైదరాబాద్ పెన్ పవర్:**
:గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధిత చట్టం 1994 ప్రకారం లింగ నిర్ధారణ చేసి ఆడ ,మగ అని చెప్పడం చట్టరీత్యా నేరమని మాత శిశు సంరక్షణ అధికారి డాక్టర్ ఎం. జైపాల్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జగిత్యాల పట్టణంలోని పలు స్కానింగ్ సెంటర్లను,మాత శిశు సంరక్షణ అధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్కానింగ్ సెంటర్లలో స్కానింగ్ మిషన్స్ మరియు డాక్టర్ల అర్హత ధ్రువీకరణ పత్రాలు దరఖాస్తు చేసుకున్న విధంగానే ఉన్నాయా అని నిర్ధారించుకున్నారు. ఫారం ఎఫ్ లు ప్రతినెల 5వ తారీఖు లోపు వారికి కేటాయించబడిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర%శీ% , ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లలో సబ్మిట్ చేయవలసిందిగా ఆదేశించారు. ఫారం ఎఫ్ లు ఆన్లైన్లో, ఆఫ్లైన్లో ఒకే విధంగా ఉండాలన్నారు. లింగ నిర్ధారణ చేసేటప్పుడు పేషంట్లకు కనపడే విధంగా ఇక్కడ లింగ నిర్ధారణ చేయబడదు - లింగ నిర్ధారణ చేసినచో కఠిన చర్యలు తీసుకోబడతాయి అను



ఫ్లెక్సీ బోర్డులు , ఫోం బోర్డులు ఏర్పాటు చేయవలెనని డాక్టర్ జైపాల్ రెడ్డి తెలిపారు. ఈ నిబంధనలు అతిక్రమించి లింగ నిర్ధారణ చేసినచో జరిమానా విధించబడడమే కాకుండా గర్భిణీ మినహా ప్రోత్సహించిన వారిపై కూడా జరిమానా మరియు మూడు నెలల జైలు శిక్ష కూడా ఉంటుందని, వైద్యుల యొక్క రిజిస్ట్రేషన్ కూడా రద్దుపరిచబడతాయని తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై నోటీసులు జారీ చేయబడతాయి. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్స్ కటుకం భూమేశ్వర్, తరాల శంకర్, ఆరోగ్య విస్తీర్ణ అధికారి రాజేశం ఏనుగంటి తదితరులు పాల్గొన్నారు.

# పెన్షనర్ల బకాయిలు చెల్లింపునకు రాజీలేని పోరాటం.

**జగిత్యాల పెన్ పవర్:**పెన్షనర్ల బకాయిలు చెల్లింపులకు రాజీలేని పోరాటం చేస్తున్నామని తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రం లో టి.పి.సి.ఏ. జిల్లా స్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా హరి అశోక్ కుమార్ పాల్గొని పలువురు రిటైర్డ్ ఉద్యోగులకు, అధికారులకు సభ్యత్వం ఇస్తూ వారిని సన్మానించారు. పెన్షనర్స్ వాయిస్ పత్రికలను ఆవిష్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ 2024 మార్చి నుంచి ఇప్పటి వరకు ఉద్యోగ విరమణ చెందిన ఉద్యోగుల, ఉపాధ్యాయుల, అధికారుల పెన్షనరీ ప్రయోజనాల బకాయిలు అందక పెన్షనర్లు పలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి. సి. హన్మంత్ రెడ్డి, కోశాధికారి గౌరీశెట్టి విశ్వనాతం, ఉపాధ్యక్షులు వెల ముల



ప్రకాష్ రావు, ఎం.డీ. యాకూబ్, సంయుక్త కార్యదర్శులు కట్ట గంగాధర్, విఠల్, కోరుట్ల అధ్యక్షులు పబ్బా శివానందం, ధర్మపురి అధ్యక్షులు కే. గంగాధర్, మల్యాల అధ్యక్షులు ఎం. డీ. యాకూబ్,మెట్ పల్లి అధ్యక్షులు మురళి, రాయికల్ అధ్యక్షులు వేణుగోపాల్ రావు, మధు సూదన్ రావు, వీరారెడ్డి, కరుణ, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ హాస్పిటల్లో వ్యక్తి మృతి పై విచారణ

**జగిత్యాల, పెన్ పవర్:**జిల్లాలోని రాయికల్ పట్టణానికి చెందిన బైరి లక్ష్మణ్ అనే వ్యక్తి ఆగస్టు 23వ తేదీన జగిత్యాల జిల్లా కేంద్రంలోని సిగ్మా హాస్పిటల్ లో హృదయ సంబంధ వ్యాధితో చికిత్స తీసుకుంటూ మృతి చెందాడు. దీనికి సంబంధించి జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎన్ శ్రీనివాస్ ను ఎంక్వైరీ ఆఫీసర్ గా నియమించగా ,గురువారం స్థానిక మోతే వాడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విచారణ చేపట్టారు.

ఈ విచారణ సందర్భంగా ఆరోగ్య శ్రీ తరపున డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్, సిగ్మా హాస్పిటల్ యాజమాన్యం, సిబ్బంది హాజరయ్యారు.కార్డియాలజీ నిపుణులు అనివార్య కారణాలవల్ల విచారణకు హాజరు కాలేదని తెలిపారు. వారిని విచారించి నివేదికను జిల్లా వైద్యాధికారికి సమర్పిస్తామని జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎన్ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శ్రీ కో ఆర్డినేటర్ సురేష్, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని డాక్టర్ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ అమలయ్యే వరకు తమ పోరాటం ఆగదు

**హైదరాబాద్ పెన్ పవర్:**బీసీ రిజర్వేషన్ అమలయ్యే వరకు తమ పోరాటం ఆగదని ,42% బిల్లులు పార్లమెంటులో ప్రవేశ పెట్టి ఆమోదించాలని, రిజర్వేషన్లు దక్కకుండా అగ్రకులాలు చేస్తున్న కుట్రలను బీసీ వర్గాలు తిప్పి కొట్టి బీసీ శ్రేణుల ఐక్యత చాటుకుందాం ఈనెల 18న బిసి వర్గాల జేఏసీ పిలుపు మేరకు రాష్ట్ర బంద్ ను విజయవంతం చేయడానికి
పట్టణ రవాణా, వ్యాపార, వాణిజ్య వర్గాలు సహకరించాలని
ఏఐటియుసి కార్మిక సంఘాల జిల్లా అధ్యక్షులు సుతారి రాములు కొరారు. గురువారం సీ ప్రభాకర్ భవన్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లులు పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదించాలని ఈ నెల 18న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బందును విజయవంతం చేయాలని
కొరారు. తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ప్రభుత్వం ఏర్పడి తర్వాత సకుటుంబ సర్వే నిర్వహించి ఆ గణాంకాల ఆధారంగా బీసీ రిజర్వేషన్లు ఏర్పాటు చేయవలసిందిగా అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంటుకి పంపడం జరిగిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో నూతన 42 శాతం రిజర్వేషన్లు ఆధారంగా జరుగుతాయనేదే భావన ఉన్న ప్రజలకు హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు తెలంగాణ రాష్ట్రంలోని బీసీ వర్గాలను త్రీవ నిరాశకు గురిచేసిందన్నారు.. బిజెపి ప్రభుత్వం పార్లమెంటులో బిల్లు పెట్టి తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చవచ్చునని కానీ బిజెపికి బిల్లు పై ఇష్టం లేక రాష్ట్ర ప్రభుత్వాలపై నింద మోపుతున్నాయని పేర్కొన్నారు. రిజర్వేషన్ పై నిర్ణయం తీసుకోకపోతే బలమైన ఉద్యమం మొదలైందని, కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని బిజెపికి చెందిన కేంద్ర మంత్రులు, ఎంపీలు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించే శక్తి లేకపోతే రాజీనామా చేయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అన్ని రాజకీయ పార్టీల బీసీ సంఘాల ప్రతినిధులతో ప్రధానమంత్రి దగ్గరికి రాష్ట్ర పతి దగ్గరికి తీసుకెళ్తామని చేసిన వాగ్దానం ఏమైంది అన్నారు. జీవో 9 పై హైకోర్టులో పిటిషన్ వేసిన రెడ్డి జాగృతికి చెందిన బుట్ట మాధవరెడ్డి తో పాటు బీసీ ద్రోహులకు తగిన గుణపాఠం తప్పదన్నారు. బీసీలకు రాజ్యాధికారం లభించే వరకు ఎలాంటి త్యాగాలకైనా సిద్ధపడి పోరాడుతామని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో బిసి నేతలు గోపాల్, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మీ పదేళ్లలో చేసిన బాకీలకు ప్రజలు సరైన గుణపాఠం చెప్పారు.

**హైదరాబాద్ పెన్ పవర్:**పదేళ్లపాటు పాలించిన బీఆర్ఎస్ పార్టీ, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఒక్క హామీని సైతం పూర్తిగా అమలు చేయలేకపోయిందని,ఇప్పుడు 'బాకీ కార్డు'ల పేరుతో ప్రజల మధ్యకు రావడం సిగ్గుచేటని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విమర్శించారు.గురువారం ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్బీఆర్ఎస్ పై తీవ్ర విమర్శలు గుప్పించారు.పదేళ్లపాటు పాలించిన బీఆర్ఎస్ పార్టీ, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఒక్క హామీని సైతం పూర్తిగా అమలు చేయలేకపోయిందని,ఇప్పుడు 'బాకీ కార్డు' పేరుతో ప్రజల మధ్యకు రావడం సిగ్గుచేటు విషయం" అని మంత్రి ధ్వజమెత్తారు.పదేళ్ల పాలనలో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలలో ఎన్ని నెరవేర్చారో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు బహిరంగ చర్చకు రావాలని తేదీ, సమయం వారే చెప్పండి %-% మేము సిద్ధమే" అని అడ్లూరి సవాల్ విసిరారు.ప్రజల కష్టంతో నిండిన రాష్ట్రాన్ని అప్పుల బాట పట్టించి, ఇప్పుడు ప్రజలే మోసపోయినట్లు నటించడం హాస్యాస్పదం అని ఈసారి ప్రజలే తీర్పు చెప్పి నిజమైన బాకీ తీర్చేస్తారన్నారు.
బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధికి కాదు, ప్రచారానికి ప్రభుత్వ ఖజాన నుండి కోట్ల రూపాయలు ఖర్చు చేశారని,ప్రజల పన్నులతో కేటీఆర్ టిఆర్ఎస్ పార్టీని నడిపారు.ఇప్పుడు రుణాల మడుగులోకి నెట్టిన రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టే బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకుంది" అని అన్నారు.ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఇరవై నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తోందని,ప్రజల విశ్వాసమే మా బలం.ప్రజల మద్దతుతో రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తున్నాం" అని మంత్రి తెలిపారు.

## ప్రధాని పర్యటన విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు

**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటనను విజయవంతం చేసిన సి.బెళగల్ మండలంలోని ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నామని సి.బెళగల్ మండల కన్వీనర్ చంద్రశేఖర్ అన్నారు. కోడుమూరుసీనియర్ నాయకులు, కెడిసిసి బ్యాంకు చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, కోడుమూరు శాసనసభ్యులు బొగ్గుల దస్తగిరి ఆదేశాల మేరకు గురువారం ఉదయం సి.బెళగల్ మండల వ్యాప్తంగా 154 బస్సులకు స్వచ్ఛందంగా కదిలివచ్చిన పొదుపు మహిళలకు, ఉపాధి హామీ శ్రామికులకు, రైతులకు కూటమి ప్రభుత్వ కార్యకర్తలకు, నాయకులకు ధన్యవాదాలు తెలుపుతున్నామని, అలాగే గత వారం రోజుల నుండి ప్రజలకు పర్యటనపై అవగాహనకల్పిస్తున్న ఎంపీడీఓ రాణెమ్మ కు, ప్రతి గ్రామంలోని పంచాయతీ కార్యదర్శులకు, వెలుగు సిబ్బందికి, ఉపాధి హామీ సిబ్బందికి ప్రతి ఒక్కరు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

**హైదరాబాద్ పెన్ పవర్:** కొడవలూరు మండలం రాజుపాలెం గ్రామంలోని వెంకటేశ్వర ఇంజనీరింగ్ కాలేజీలో ఉరి వేసుకుని ఉదయ్ కిరణ్ అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు.
పోరుమామిళ్ల గ్రామానికి చెందిన ఉదయ్ కిరణ్ వేంకటేశ్వరా కాలేజీ లో డిప్లమా ఫస్టియర్ చదువుతున్నాడు,ఇదే కాలేజీలో ఓ విద్యార్థి ట్యాబ్ పోయిందని ఈ విషయం లో ఉదయ్ కిరణ్ పై అనుమానంతో మహిళా ప్రొఫెసర్ మందలించిందని ఈ కారణంగా మనస్థాపంతో ఉరి వేసుకున్నట్లు సమాచారం..ఘటనా స్థలానికి చేరుకొని పోలీసులు విచారిస్తున్నారు..మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఉదయ్ కిరణ్ తల్లితండ్రులు,బంధువులు పెద్దఎత్తున కాలేజ్ వద్దకు చేరుకున్నారు. విద్యార్థి సంఘాలు కూడా కాలేజీ ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్నారు..

## ఘనంగా ప్రారంభమైన ఎస్ జి ఎఫ్ 69వ రాష్ట్ర స్థాయి కబడ్డీ వాలీబాల్ పోటీలు

**హైదరాబాద్ పెన్ పవర్:**
సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో స్థానిక శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ జి ఎఫ్ 69వ రాష్ట్ర స్థాయి కబడ్డీ వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలను న మెదక్ యంపియం.రఘునందన్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా కలెక్టర్ పి.ప్రవీణ్య, ఎస్ పి పంకజ్ పరితోష్, ప్రజా ప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు ప్రారంభించారు. 33 జిల్లాల నుంచి 380 మంది క్రీడాకారులు , 160 మంది ఫిజికల్ ట్రైనర్లు, సుమారు 2000 సిబ్బంది హాజరు.. ఉత్సాహభరితంగా మైత్రి మైదానంలో ఉత్సాహంతో కేరింతలతో క్రీడోత్సవాలు ప్రారంభం అయ్యాయి.

## ఔటర్ రింగు రోడ్డు పై ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బీభత్సం.

**హైదరాబాద్ పెన్ పవర్:** ఔటర్ రింగు రోడ్డు పై ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బీభత్సం సృష్టించింది. వేగంగా వచ్చి అదుపు తప్పి ఢీ వైడర్ ను ఢీ కొట్టి అవతల రోడ్డు వైపు దూసుకొని వెళ్లి బొలెరో వ్యాన్ ను ఢీ కొట్టింది. ఘటనలో ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. 30 మంది ప్రయాణీకులు ఊపిరి పీల్చుకున్నారు. అక్కడ భారీ గా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణం అని పోలీసులు అంటున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గురుకులాలలో సీట్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

**హైదరాబాద్ పెన్ పవర్:**జిల్లాలోని అన్ని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు అభ్యర్థుల నుండి దరఖాస్తులుస్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో గురుకుల ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థినీ విద్యార్థులు గతంలో దరఖాస్తు చేసుకున్న వారితో పాటు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 17 వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా లక్షెట్టిపేట బాలికల గురుకుల విద్యాలయంలో దరఖాస్తులు సమమర్పించాలని తెలిపారు. కుల ధ్రువీకరణ పత్రంతో పాటు ప్రవేశపరీక్ష రాసిన విద్యార్థులు హాల్ టికెట్ ర్యాంకు ధ్రువీకరణ పత్రాల నకలు ప్రతులు జత పరచాలని సూచించారు. లక్షెట్టిపేట చెన్నూరు మందమర్రి బెల్లంపల్లి (బాలికలు) బెల్లంపల్లి



కాసిపేట కోటపల్లి మంచిర్యాల జైపూర్(బాలుర) సాంఘిక సంక్షేమ గురుకులాలలో ఖాళీగా ఉన్న సీట్లను ఈ నెల 18న లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేసి, భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు. బాలికల గురుకులాలలోని 6వ తరగతిలో ఎస్ సి 6
ఎస్టి 2 బీసీ 3 జనరల్ 3 మైనారిటీ 2 సీట్లు ఉన్నాయని 7వ తరగతిలో బీ సి 5 సీట్లు 8 వ తరగతిలో ఎస్ సి 4 ఎస్టి 1బీసీ 10 జనరల్ 6 మైనారిటీ 5 9వ తరగతి లో ఎస్ సి 3%ఎ% ఎస్టి 4 బీసీ 4 జనరల్ 5 మైనారిటీ 3 సీట్లు ఉన్నాయని తెలిపారు. బాలుర గురుకులాలలో 5వ తరగతిలో ఎస్టి 3 జనరల్ 3 మైనారిటీ 2 సీట్లు 6వ తరగతిలో ఎస్ సి 9 ఎస్టి 5 జనరల్ 1 మైనారిటీ 6 సీట్లు 7వ తరగతిలో ఎస్ సి 5 సీట్లు 8వ తరగతిలో ఎస్ సి 8 బీసీ 8 జనరల్ 6 మైనారిటీ 8, 9వ తరగతి లో ఎస్ సి 11 బీసీ 4 ఓసీ 7 మైనారిటీ 5 సీట్లు ఉన్నాయని తెలిపార

# ప్రజాపాలనలో జిల్లా అధ్యక్ష పదవిపై కార్యకర్తల అభిప్రాయ సేకరణ



**హుజురాబాద్,పెన్ పవర్:**
సంఘటన్ శ్రీజన్ అభియాన్ కార్యక్రమం ద్వారా దేశంలో కాంగ్రెస్ పార్టీ నూతన ఒరవడిని తీసుకొచ్చిందని కర్ణాటక రాష్ట్ర హంగల్ శాసన సభ్యుడు మానే శ్రీనివాస్ అన్నారు.గురువారం హుజూరాబాద్ పట్టణంలో ఓ ఫంక్షన్‌హాల్ లో స్థానిక కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మానకొండూర్ శాసనసభ్యుడు కవ్వంపల్లి సత్యనారాయణ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ, టీపీసీసిపరిశీలకులు మ్యాడం బాలకృష్ణ మీడియా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ గతాని కంటే బిన్నంగా ఈ సారి జిల్లా అధ్యక్షుల ఎంపికను వార్డు,గ్రామం,మండల,నియోజక వర్గ స్థాయి నాయకులఅభిప్రాయాలు తీసుకొని జిల్లా అధ్యక్షున్ని ఎన్నుకోవడం జరుగుతుందని,దేశంలోనీ ఐదు రాష్ట్రాల్లో పూర్తి చేసుకొని దక్షిణ భారతదేశంలోని తెలంగాణకు ఈ కార్యక్రమాన్ని తీసుకువచ్చామని అన్నారు. జిల్లాల వారిగాపరిశీలకులు నాయకుల అభిప్రాయాలు తీసుకుంటున్నారని అన్నారు. ప్రజల మధ్య ఉండి ప్రజలతో మమేకమయ్యే నాయకులకు అవకాశం దక్కుతుందని,రాబోయే రోజుల్లో జిల్లా అధ్యక్షులకే కాదు మండల నాయకులనుకూడా ఇదే విధంగా ఎన్నుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# "కోట్ల" ను ప్రత్యేకంగా పలకరించిన ప్రధాని నరేంద్ర మోడి

**కర్నూలు:** భారత ప్రధాని నరేంద్ర మోడీ కర్నూలు పర్యటనలో భాగంగా ఓర్వకల్లు విమానాశ్రయానికి రాగానే రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబునాయుడు జిల్లా ఎమ్మెల్యేలను వరుసగా పరిచయం చేశారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాశ్ రెడ్డి గారిని చంద్రబాబు ప్రధానికి పరిచయం చేస్తుండగానే లి"పెద్ద మనిషి నాకు బాగా తెలుసు, కేంద్ర మంత్రిగా పనిచేశారు కదా" అని ప్రధాని చంద్రబాబుతో అన్నారు. కర్నూలు జిల్లాపర్యటనకు ప్రత్యేకంగా దృష్టి సారించి వచ్చినందుకు ప్రధాని నరేంద్ర మోడీకి కోట్ల కృతజ్ఞతలు తెలియజేశారు.

# కరీఫ్ వానాకాలం ధాన్యం కొనుగోలు ప్రణాళికలు సిద్ధం చేయాలి

**జగిత్యాల, పెన్ పవర్:**కరీఫ్ వానాకాలం ధాన్యం కొనుగోలు ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు.

గురువారం జగిత్యాల జిల్లా సమీకృత కార్యాలయంలో వానకాలం మరియు యాసంగి 2024-2025సీఎంఆర్ చెల్లింపు, పై ప్రస్తుతం వానాకాలం 2025-26 వరిధాన్యం కొనుగోలు విషయంలో రా మరియు బాయిల్డ్ రైస్ మిల్లర్లుతో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్,అదనపు కలెక్టర్ బి.ఎస్ లత సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూవానాకాలం 2025-26 సీజన్ నందు 666500 ఎంటీఎస్ ల వరిధాన్యం కొనుగోలు కొరకు ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు.ఈ వానాకాలం సీజన్ లో వరి ధరలు గ్రేడ్ ఏ- 2389/-,కామన్ ధరలు %-% 2369/- కలవు. ఈ సీజన్ కు గాను ఐకేపీ %-% 137,పీఏసీఎస్ - 285,ఎంఈపీఎంఏ -1 మొత్తం %-% 423 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలనుప్రతిపాదించడం జరిగిందని తెలిపారు.




ఈ వానాకాలంలో (92) బాయిల్డ్ మిల్లులు పాల్గొంటున్నందున ప్రతి ఒక్క రైస్ మిల్లు వారు తప్పనిసరిగా 100 % బ్యాంకు గ్యారెంటి డీఎంసీఎస్సీ కార్యాలయంలో సమర్పించాలన్నారు. రైస్ మిల్లులో 50-60 హమలీ లను సమకుర్చుకోవాలన్నారు.

ఎప్పటికప్పుడు మిల్లుకు వచ్చిన లారీ లను త్వరితగతిన దిగుమతి చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన ధాన్యం నాణ్యత ప్రమాణాలతో లేకపోతే సంబంధిత పౌరసరఫరా క్షేత్రస్థాయి సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి.ఎస్ లత, జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్ రెడ్డి, జిల్లా మేనేజర్ పౌరసరఫరా సంస్థ జితేంద్ర ప్రసాద్, జిల్లా రా, బాయిల్డ్ రైస్ మిల్లర్ అసోసియేషన్ నాయకులు ,ఇతర రైస్ మిల్లర్లు నాయకులు పౌర సరఫరా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దెబ్బకు పరార్.. పాక్ సైనికుల దుస్తులను బహిరంగంగా ప్రదర్శించిన తాలిబన్లు

**హైదరాబాద్ పెన్ పవర్:**

: అఫ్ఘానిస్థాన్‌లో తాలిబన్లు పాలనా పగ్గాలు చేపట్టిన తర్వాత ఆ దేశ విదేశాంగ మంత్రి తొలిసారిగా భారత్‌లో పర్యటించారు. దీంతో ఇరు దేశాల మధ్య సంబంధాలు మళ్లీ పునరుద్ధరించాయి. అయితే దీనిపై దాయాది పాకిస్థాన్ తన అక్కసును వెళ్లగక్కింది. తాలిబన్లు భారత్‌కు దగ్గరవుతుండటంతో ఆగ్రహించిన పాక్ పాలకులు తమ సైన్యాన్ని ఉసిగొల్పారు. అఫ్ఘాన్‌లోని కాందహార్ ప్రావిన్సు, పాక్‌లోని బలోచిస్థాన్ ప్రాంతం మధ్య ఉన్నకీలక సరిహద్దు జిల్లా స్పిన్ బోల్దక్‌లో మంగళవారం అర్ధరాత్రి పాక్ సైనికులు దాడులకు పాల్పడ్డారు. దీంతో 15 మంది మరణించగా, 100 మందికిపైగా గాయపడ్డారని అఫ్ఘాన్ పాలకులు ప్రకటించారు.దీనికి ప్రతిగాతాలిబన్ బలగాలు పాక్ సైనికులపై దాడులకు దిగాయి. పాకిస్థాన్‌లోని చమన్ జిల్లా, అఫ్ఘాన్‌లోని బోల్దక్ జిల్లాలో ఉభయ దేశాలకు చెందిన సైనిక దళాలు పరస్పరం కాల్పులు జరుపుకున్నారు. మరోవైపు స్పిన్ బోల్దక్‌లోతమ సైనిక స్థావరాలపై దాడి చేసేందుకు పాక్ సైన్యం ఉపయోగించిన యుద్ధ ట్యాంకును స్వాధీనం చేసుకున్న తాలిబన్ బలగాలు, పాక్ సైనిక ఔట్‌పోస్టుపై మెరుపు దాడి చేసినట్లు వార్తలు వచ్చాయి. ఈ సందర్భంగా పాక్ సైనికులు పరారైనట్లు, కొంత మందిని బంధించినట్లు, భారీగా ఆయుధాలు, ఆహార పదార్థాలను స్వాదీనం చేసుకున్నట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి.తాజాగా ఆ వార్తలు నిజమేనని, తమ దెబ్బకు పాక్‌సైనికులు పరారయ్యారని తాలిబన్ సైన్యం నిరూపించింది. తాము స్వాధీనం చేసుకున్న ఆయుధాలు, ఆహార పదార్థాలు, పాక్ సైనికుల దుస్తులు, ఇతర సామాగ్రిని అఫ్ఘాన్ సైనికులు నంగర్‌హార్ ప్రావిన్స్‌లో బహిరంగంగాప్రదర్శించారు. పాక్ సైనికుల ప్యాంట్లను ప్రదర్శిస్తూ.. ఆ దేశానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ దృష్యాలను అఫ్ఘానిస్థాన్‌లోని బీబీసీ జర్నలిస్టు దౌద్ జున్బిష్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈ సందర్భంగా పాక్‌సైన్యం విడిచిపెట్టిన అవుట్‌పోస్టుల వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న ప్యాంట్‌లను తాలిబాన్ ప్రదర్శిస్తున్నదని ఆయన రాసుకొచ్చారు. ప్రస్తుతం అవి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

# తాండూరు జిల్లా ఆసుపత్రికి త్వరలో ఐసీయూ

**జిల్లా ఆస్పత్రిని సందర్శించిన ఎమ్మెల్యే**

**హైదరాబాద్ పెన్ పవర్:**:త్వరలో ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి ఐసియు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు.

గురువారం వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణ కేంద్రంలో గల ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిని ఆయన సందర్శించారు. ఈ మేరకు జిల్లా ఆసుపత్రిలో సేవలు అందిస్తున్న తీరును పరిశీలించారు. అనంతరం రోగులతో వైద్య సదుపాయాలపై ఆరా తీశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...తాండూరు పట్టణంలో ఉన్న జిల్లా ఆసుపత్రి లో వైద్య సేవలు మెరుగుపడడానికి కృషి చేస్తామని అన్నారు. పురాతన భవనం ఏర్పడిన కారణంగా అక్కడక్కడ మరమ్మతులు చేయవలసిన పరిస్థితి ఉందని అన్నారు. దీనిపై కలెక్టర్కు నివేదిక తీసుకొని పనులు చేపట్టాలని తెలుపుతామని పేర్కొన్నారు. అలాగే ఇంత పెద్ద ఆసుపత్రిలో ఐసియు సేవలను కూడా త్వరలో అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆసుపత్రి విజయకుమార్ ఆర్ఎంఓ ఆనంద్ గోపాల్ రెడ్డి,సిబ్బంది తదితరులు ఉన్నారు.

## అశ్వరావుపేట మండలాన్ని మాదక ద్రవ్య రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు అశ్వరావుపేట పోలీసుల ఆధ్వర్యంలో నెల రోజుల పాటు చైతన్యం పేరుతో పలు కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతున్నదని అశ్వారావుపేట సీఐ నాగరాజు రెడ్డి తెలిపారు.

అశ్వారావుపేట మండలంలో మాదక ద్రవ్యాల సమూల నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు భాద్యతను నిర్వర్తించాలని అశ్వారావుపేట సీఐ నాగరాజు రెడ్డి పిలుపునిచ్చారు.చైతన్యం పేరుతో నెల రోజుల పాటు అశ్వారావుపేట మండలం వ్యాప్తంగా పోలీసుల ఆధ్వర్యంలో గంజాయి వంటి మత్తు పదార్ధాల నిర్మూలన కోసం అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగానే ఈ రోజు అశ్వరావుపేట రింగ్ సెంటర్ వద్ద మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్ధాలను గురించి అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఈ నెల రోజుల పాటు పోలీసులు చేపట్టే కార్యక్రమాలలో ప్రజలు కూడా భాగస్వాములై తమ వంతు భాద్యతగా సహకారం అందించాలని కోరారు.మత్తుకు బానిసలుగా మారిన యువత తమ అమూల్యమైన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని,వారిలో చైతన్యం నింపేందుకే జిల్లా ఎస్పీ గారి ఆదేశాలతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. అశ్వరావుపేట పట్టణంలో గంజాయి హాట్స్పాట్స్ లో నిత్యం తనిఖీలు చేపట్టడం,ఎవరైనా మత్తు పదార్ధాలను సేవిస్తూ పట్టుబడితే వారికి కౌన్సిలింగ్ నిర్వహించడం,వాహన తనిఖీలు వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.ఎవరైనా నిషేదిత గంజాయిని రవాణా చేస్తున్నట్లు గానీ,విక్రయిస్తున్నట్లు గానీ,సేవిస్తున్నట్లు గానీ సమాచారం తెలిస్తే పోలీసు వారికి వెంటనే సమాచారం అందించాలని కోరారు.

## బిగ్ బాస్ షోపై పిర్యాదు అశ్లీలతకు వ్యతిరేకంగా యువకుల ఆందోళన

**బిగ్ బాస్లో అశ్లీలత, పాశ్చాత్య సంస్కృతి ప్రోత్సాహం జరుగుతోందని ఆరోపణ**

**జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేసిన గజ్వేల్ కు చెందిన యువకులు**




**హైదరాబాద్ పెన్ పవర్:**బిగ్ బాస్లో అశ్లీలత, పాశ్చాత్య సంస్కృతి ప్రోత్సాహం జరుగుతోందని ఆరోపిస్తూ సిద్దిపేట జిల్లా గజ్వేల్కు చెందిన రవీందర్ రెడ్డి, కమ్మరి శ్రీనివాస్, చంద్రశేఖర్ గౌడ్, మరికొందరు యువకులు కలిసి జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేశారు.

వారు తమ ఫిర్యాదులో పేర్కొన్నట్లు, “బిగ్ బాస్ షోలో కుటుంబాలు కలిసి చూడలేని స్థాయిలో అశ్లీల సన్నివేశాలు, అనవసర వాగ్వాదాలు, పాశ్చాత్య సంస్కృతి ప్రభావం పెరుగుతోంది. ఇది యువతపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. అందువల్ల వెంటనే షోను నిలిపివేయాలని” విజ్ఞప్తి చేశారు... బిగ్ బాస్ షో ను నిలిపివేయకపోతే మహిళా సంఘాలతో అన్నపూర్ణ స్టూడియో ను ముట్టడిస్తామని తెలిపారు.

## గుజరాత్‌లోని అహ్మదాబాద్ వేదికగా 2030 కామన్‌వెల్త్ క్రీడలు

### విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్

**హైదరాబాద్ పెన్ పవర్:** గుజరాత్‌లోని అహ్మదాబాద్ వేదికగా 2030 కామన్‌వెల్త్ క్రీడలు జరగనున్నాయి. విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఇవాళ ఈ విషయాన్ని వెల్లడించారు. ఆయన తన ఎక్స్ అకౌంట్ వేదికగా ఈ అంశాన్ని ప్రకటించారు. 2030లో జరిగే కామన్‌వెల్త్ క్రీడలకు భారత్ ఆతిథ్యం ఇవ్వనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ఇది భారత దేశానికి, గుజరాత్‌కు గర్వకారణమన్నారు. ప్రపంచ స్థాయి మౌళిక సదుపాయాల కల్పనకు, క్రీడా టాలెంట్‌ను వెలికి తీసేందుకు ప్రధాని మోదీ విజన్ నిదర్శనంగా పనిచేస్తుందన్నారు. అయితే 2036లో ఒలింపిక్స్ క్రీడలు నిర్వహించాలనుకుంటున్న భారత్‌కు.. కామన్‌వెల్త్ క్రీడల నిర్వహణ ఓ ప్లాట్‌ఫామ్‌గా నిలిచే అవకాశం ఉన్నది. నవంబర్ 26వ తేదీన స్కాట్‌లాండ్‌లోని గ్లాస్‌గోవ్‌లో జరగనున్న జనరల్ అసెంబ్లీ సమావేశాల్లో అహ్మదాబాద్ అంశాన్ని పరిశీలించనున్నారు. భారత్ 2010లో ఢిల్లీ వేదికగా కామన్‌వెల్త్ క్రీడలను నిర్వహించింది. అయితే ఆ క్రీడలపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. సరైన ప్లానింగ్ జరగలేదన్నారు. మౌళిక సదుపాయాల కల్పనలో జాప్యం జరిగిందన్నారు. అవినీతి ఆరోపణలు కూడా వచ్చాయి.

## 120 మంది నక్సల్స్ తో కలిసి లొంగిపోనున్న ఆశన్న..!

**హైదరాబాద్ పెన్ పవర్:** మావోయిస్టు అగ్రనేత ఆశన్న పోలీసుల ఎదుట లొంగిపోనున్నాడు. ఆశన్న అలియాస్ రూపేష్ సుమారు 120 మంది నక్సల్ తో కలిసి పోలీసుల ఎదుట లొంగిపోయే అవకాశం ఉంది. ములుగు జిల్లాకు చెందిన ఆశన్న1991 లో పీపుల్స్ వార్ పార్టీలో చేరారు. 1999 లో పీపుల్స్ వార్ యాక్షన్ టీం అధిపతిగా నియామకమయ్యారు. 2003లో అలిపిరిలో అప్పటి సిఎం చంద్రబాబు నాయుడు కాన్వాయ్ పేల్చివేత, 2000 అప్పటి హెూంమంత్రి మాధవరెడ్డిని చంపిన ఘటనలో ప్రధాన నిందితుడిగా ఆశన్న ఉన్నారు. రెండు రోజుల క్రితం మహారాష్ట్రలోని గడ్చిరోలిలో మల్లోజుల వేణుగోపాల్ 60 మంది మావోయిస్టులతో పాటు పెద్ద ఎత్తున ఆయుధ సామాగ్రితో మంగళవారం గడ్చిరోలి పోలీసుల ఎదుట లొంగిపోయిన విషయం తెలిసిందే.

## వైభవంగా పాలమూరు యూనివర్సిటీ స్నాతకోత్సవం

### హాజరయిన రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**మహబూబ్ నగర్ పెన్ పవర్::** పాలమూరు విశ్వవిద్యాలయంలో గురువారం నాల్గవ స్నాతకోత్సవం వైభవంగా జరిగింది. ఈ వేడుకలకు కులపతి హెూదాలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి గవర్నర్ కు పుష్పగుచ్ఛం అందించి సాదర స్వాగతం పలికారు. అనంతరం పాలమూరు విశ్వవిద్యాలయం నాల్గవ స్నాతకోత్సవం లో గవర్నర్ 12 మంది స్కాలర్స్ కు పి హెచ్ డి పట్టాలను, 83 మందికి బంగారు పతకాలను అందజేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త మన్నె సత్యనారాయణ రెడ్డి తొలి గౌరవ డాక్టరేట్ ను గవర్నర్ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పి హెచ్ డి స్కాలర్స్ లను బంగారు పతకాల గ్రహీతలను, తొలి డాక్టరేట్ గ్రహీత మన్నె సత్యనారాయణ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో న్యూఢిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, ప్రభుత్వ సలహాదారు (క్రీడా వ్యవహారాలు) ఎపి జితేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, పాలమూరు ఉపకులాపతి జి.ఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సాగరమాల ప్రాజెక్టు పనులపై సమీక్షించిన ..జిల్లా కలెక్టర్

తిరుపతిజి

తిరుపతి జిల్లాలో సాగరమాల ప్రాజెక్టు కింద గ్రీన్ ఫీల్డ్ హైవేల పనులను ఈ రోజు పరిశీలించడం జరిగిందని తెలిపారు. ఈ ప్రాజెక్టులు మొత్తం నాలుగు ప్యాకేజీలుగా రూపుదిద్దుకున్నాయి. సుమారు ?3000 కోట్ల వ్యయంతో 125 కిలోమీటర్ల గ్రీన్ ఫీల్డ్ రోడ్ల నిర్మాణం జరుగుతోందన్నారు. ఈ రోడ్లు ప్రధానంగా చెన్నై – కోల్కతా నేషనల్ హైవేను కృష్ణపట్నం పోర్టుతో అనుసంధానించేలా రూపకల్పన చేయబడ్డాయి అన్నారు. ప్రధాన ప్యాకేజీలు నాయుడుపేట – కృష్ణపట్నం పోర్టు (సౌత్ గేట్) వరకు సుమారు 36 కిలోమీటర్లు, వరగలి క్రాస– కృష్ణపట్నం పోర్టు వరకు సుమారు 35 కిలోమీటర్లు ముత్తుకూరు పరిధిలో సుమారు 19 కిలోమీటర్ల
ప్యాకేజీ ఇంకో ఇంటర్నల్ కనెక్టివిటీ ప్యాకేజీ, కలిపి మొత్తం నాలుగు ప్యాకేజీలు గలవని తెలిపారు.

ఈ నాలుగు ప్యాకేజీలలో మూడు తిరుపతి జిల్లా పరిధిలో, ఒక ప్యాకేజీ నెల్లూరు జిల్లా పరిధిలో ఉన్నాయని ఈరోజు అన్ని
ప్యాకేజీలను సైట్‌లో పరిశీలించి, భూసేకరణ, మైనింగ్, ఇరిగేషన్ తదితర శాఖలతో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కార చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ పనులలో మూడు ప్యాకేజీలు 2025 డిసెంబర్
నాటికి, మిగతా ప్యాకేజీ 2027 జూన్ నాటికి పూర్తి కానున్నాయని అన్నారు. ఈ హైవేలు పూర్తయిన తర్వాత కృష్ణపట్నం పోర్టుకు కనెక్టివిటీ మరింత బలపడుతుందన్నారు. దీని వలన ప్రాంతీయ పరిశ్రమల అభివృద్ధి,
పెట్టుబడుల ఆకర్షణ మరింత పెరుగుతాయన్నారు. అదేవిధంగా కృష్ణపట్నం ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ (క్రిస్ సిటీ) ప్రాజెక్టు కింద సుమారు 2500 ఎకరాల్లో ?1200 కోట్లతో ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి పనులు

కొనసాగుతున్నాయి. ఈ ప్రాజెక్టుకు గౌరవ ప్రధానమంత్రి గారు 2025 జనవరిలో శంకుస్థాపన చేశారు. ఇప్పటికే ?200 కోట్లకు పైగా పనులు పూర్తి అయ్యాయి. ఈ ప్రాజెక్టు కూడా 2026 డిసెంబర్ నాటికి పూర్తి
కానుందని.

మొత్తం ?4500 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనులు గూడూరు నియోజకవర్గ పరిధిలో శరవేగంగా సాగుతున్నాయి అని తెలిపారు. ఈ పనుల పురోగతిని సమీక్షించడానికి ఈరోజు సంబంధిత లైన్‌డిపార్ట్మెంట్లు మరియు %చీనాా×% అధికారులతో సమీక్షించామన్నారు.

# ఇండియన్ లిటరసీ ప్రాజెక్ట్ సందర్శించిన నాలెడ్జ్ హబ్ మేనేజర్ రవిమణి

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియా లిటరసీ ప్రాజెక్ట్ బెంగళూరు వారి సహకారంతో వనపర్తి జిల్లాలో రూరల్ డెవలప్మెంట్ సొసైటీ వారి ఆధ్వర్యంలోనిర్వహిస్తున్న ప్రోగ్రాంలో భాగంగా నాలెడ్జ్ ఆఫ్ మేనేజర్ రవిమణి రెండు రోజులు అంగన్వాడిసెంటర్స్, సైన్స్ కిట్స్ ,కంప్యూటర్ హబ్ ఐసిటి, చైల్డ్ క్లబ్, కెరియర్ గైడెన్స్, హెల్ప్ డిస్కవరీ వాటిని గురించి వనపర్తి, పెబ్బేర్ ,సూగుర్, ఆమడబాకుల సెంటర్స్ ని సందర్శించడం జరిగింది. దీనిలో భాగంగా మాడల్అంగన్వాడీలో ప్రీస్కూల్ యాక్టివిటీ, ప్రికాస్ట్, లోకాస్ట్ మెటీరియల్ ఉపయోగిస్తూ పిల్లలకు యాక్టివిటీస్ నేర్పించడం, ఆటపాటలతో విద్య పనితీరును పరిశీలించడం జరిగింది. సైన్స్ కిట్టు లో విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలు
టీచర్స్ కి ఇచ్చిన ట్రైనింగ్ పిల్లలకు ఎంతవరకు అర్థవంతంగా చెబుతున్నారో సైన్స్ కిట్టుల యొక్క ఉపయోగాలు ఏ విధంగా ఉన్నాయో చూడడం



జరిగింది. %జశీఎజూబ్వతీ ఎఖదీ ×జు% లో భాగంగా కంప్యూటర్‌బేసిక్స్, కంప్యూటర్ ని ఉపయోగించి పుస్తకంలో ఉన్న సారాంశాన్ని కంప్యూటర్లో డ్రాయింగ్ రూపంలో సులభంగా అర్థమయ్యే విధంగా ఉపయోగించిన విధానాన్ని పరిశీలించడం జరిగింది. ఈ సందర్శనలో భాగంగా రూరల్‌డెవలప్మెంట్ సొసైటీ వనపర్తి జిల్లా ప్రెసిడెంట్ చిన్నమ్మ థామస్ మాట్లాడుతూ ఐ ఎల్ పి ప్రోగ్రాం వలన వనపర్తి జిల్లాలో చాలావరకు పాఠశాలలు అంగన్వాడీలు ఉండే పిల్లలకు నాణ్యమైన విద్య అందుతుంది అని
తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐ ఎల్ పి ప్రోగ్రాం డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ మీనా థామస్, ఐ ఎల్ పి స్టాఫ్ శ్రీలక్ష్మి, అరుణ, జ్యోతి,కల్పన, రమాదేవి, రామకృష్ణ, మొగులయ్య, కరిష్మా, అన్ని పాఠశాలల
ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొనడం జరిగింది.

# ఘనంగా ఛెఫ్ డే వేడుకలు

**హైదరాబాద్ పెన్ పవర్::** ఆరోగ్యకరమైన ఆహారము చాలా అవసరమని తెలంగాణ ప్రభుత్వ మాజీ కార్యదర్శి రాజా సదరం అన్నారు. ఆహారం అనేది నిత్య జీవితంలో ఒక భాగం అని.... ఆహారం పై పిల్లలకు అవగాహన కల్పించడం శుభపరిణామం అన్నారు. హైదరాబాద్ బేగంపేట లోని కలినారి అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ చెఫ్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మాజీ కార్యదర్శి రాజా సదరం, కలినారి ఆఫ్ ఇండియా హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ అక్షయ కులకర్ణి, కలినారి అకాడమీ ఆఫ్ ఇండియా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు ...ఎలాంటి ఆహారం తీసుకోవాలి అనే దానిపై అవగాహన కల్పించడంతోపాటు రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రతి ఏడాది అక్టోబర్ 20 న ఇంటర్నేషనల్ చెఫ్ డే నిర్వహిస్తున్నారు ప్రతి సంవత్సరం ఒక్కొక్క థీమ్ తో నిర్వహిస్తారు. ఏడాది ఫుడ్ ఎక్స్ ఫ్లోర్ థీమ్ పేరుతో నిర్వహిస్తున్నట్లు కలినారి అకాడమీ అకాడమీ ఆఫ్ ఇండియా హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ అక్షయ కులకర్ణి తెలిపారు. ఆరోగ్యకరమైన ఆహారం ఏ విధంగా తయారు చేసుకోవాలి.... ఎలాంటి ఆహారం ఆరోగ్యం ఇస్తుంది అనే విషయాలను పిల్లలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్యకరమైన ఆహారం ఎలా తయారు చేసుకోవాలో .... పిల్లలకు తయారీ చేసి చూపించినట్లు ఆయన చెప్పారు. మరి ముఖ్యంగా మంచి ఆరోగ్యం ఉండాలంటే మిల్లెట్స్ ప్రధాన భూమిక పోషిస్తాయని తెలిపారు. భవిష్యత్తులో మంచి ఆరోగ్యాన్ని పిల్లలకు అందించాలన్నదే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం అని ఆయన వివరించారు..

# ఆహారం అనేది నిత్య జీవితంలో ఒక భాగం

**హైదరాబాద్ పెన్ పవర్:**
బీఆహారం అనేది నిత్య జీవితంలో ఒక భాగం అని,ఆరోగ్యకరమైన ఆహారము చాలా అవసరమని తెలంగాణ ప్రభుత్వ మాజీ కార్యదర్శి రాజా సదారం అన్నారు. ఆహారం పై పిల్లలకు అవగాహన కల్పించడం శుభపరిణామం అన్నారు. హైదరాబాద్ బేగంపేట లోని కలినారి అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ చెఫ్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మాజీ కార్యదర్శి రాజా సదారం, కలినారి ఆఫ్ ఇండియా హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ అక్షయ కులకర్ణి, కలినారి అకాడమీ ఆఫ్ ఇండియా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు ...ఎలాంటి ఆహారం తీసుకోవాలి అనే దానిపై అవగాహన కల్పించడంతోపాటు రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రతి ఏడాది అక్టోబర్ 20 న ఇంటర్నేషనల్ చెఫ్ డే నిర్వహిస్తున్నారు ప్రతి సంవత్సరం ఒక్కొక్క థీమ్ తో నిర్వహిస్తారు. ఏడాది ఫుడ్ ఎక్స్ ప్లోర్ థీమ్ పేరుతో నిర్వహిస్తున్నట్లు కలినారి అకాడమీ అకాడమీ ఆఫ్ ఇండియా హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ అక్షయ కులకర్ణి తెలిపారు. ఆరోగ్యకరమైన ఆహారం ఏ విధంగా తయారు చేసుకోవాలి.... ఎలాంటి ఆహారం ఆరోగ్యం ఇస్తుంది అనే విషయాలను పిల్లలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్యకరమైన ఆహారం ఎలా తయారు చేసుకోవాలో .... పిల్లలకు తయారీ చేసి చూపించినట్లు ఆయన చెప్పారు. మరి ముఖ్యంగా మంచి ఆరోగ్యం ఉండాలంటే మిల్లెట్స్ ప్రధాన భూమిక పోషిస్తాయని తెలిపారు. భవిష్యత్తులో మంచి ఆరోగ్యాన్ని పిల్లలకు అందించాలన్నదే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం అని ఆయన వివరించారు.

## నిద్ర, ఆహానం మార్పుతో రోగాలు

**హైదరాబాద్ పెన్ పవర్:**:నిద్ర ఆహారం వేళలు మారడంతో కనీస శారీరక శ్రమ లేకపోవడం వంటి కారణాలతో మనిషి రోగాల బారిన పడుతున్నాడని షుగరు బిపి మెటబాలిజం మతిమరుపు వంటి రుగ్మతలు చోటు చేసుకుంటున్నాయని కెపిహెచ్బి కాలనీలోని సహస్ర క్లినిక్ డాక్టర్ హరిచంద్ర రెడ్డి హెచ్చరించారు. వీటికి కారణం జంక్ ఫుడ్ తినడం రాత్రి సమయంలో పని చేయడం, పగలు నిద్రపోవడం, సెల్ఫోన్, కంప్యూటర్ యూసేజ్ పెరిగిపోవడం లాంటివి దోహదపడతాయి అన్నారు. చిన్నపిల్లల సైతం ఒబిసిటీ మధుమేహం బారిన పడటానికి కారణం శారీరక శ్రమ లేకపోవడం స్కూళ్లోనూ, కనీసం ఇంట్లోనైనా ఆడుకునే పరిస్థితి లేకపోవడం పెద్ద కారణంగా చెప్పొచ్చు అన్నారు ఇలాంటి వారిని వాటిని నివారించాలంటే సమయానికి తినడం నిద్రపోవడం, వేకువనే లేవడం, ఆటలు ఆడటం, వేగంగా నడక వంటివి చేయాలని సూచించారు.

ప్రస్తుత తరంలో నిద్రలేమికి చికిత్స చేయడానికి తాజా మందులు, ఆరోగ్యకరమైన జీవనశైలి పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. మంచి జనరల్ ఫిజిషియన్, న్యూరోసైకియాట్రిస్ట్ వైద్యుల సహాయంతో రోగులు బాగా చికిత్స పొందవచ్చు. సంతోషకరమైన ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చు.

## శాస్త్రోక్తంగా శ్రీ గోవిందరాజస్వామి వారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**హైదరాబాద్ పెన్ పవర్:** తిరుపతి శ్రీ స్వామివారి ఆలయంలో అక్టోబరు 20న దీపావళి ఆస్థానం సందర్భంగా గురువారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. దీపావళి ఆస్థానం సందర్భంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా ఉదయం 5 గం.లకు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, సహస్రనామార్చన, నివేదన, శాత్తుమొర నిర్వహించారు. తదుపరి కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అని వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రమిశ్రమాన్ని ఆలయం అంతటా గోడలకు (లేపనం) పూశారు. అనంతరం భక్తులను ఉదయం 09.30 గంటల తర్వాత సర్వ దర్శనానికి అనుమతించారు.

# సేవా కార్యక్రమాలను మరింత విస్తరిస్తాం




**హైదరాబాద్ పెన్ పవర్:**యాదవ్ చారిటబుల్ ట్రస్ట్ మరోసారి తమ దాతృత్వాన్ని చాటుకుంది. పెద్దపల్లి జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ఎలాంటి వేతనం లేకుండా స్వచ్ఛందం గా సేవలందిస్తున్న నలుగురు వాలంటీర్లకు గౌరవ వేతనం అందించే కార్యక్రమం గురువా రం నిర్వహించారు. వారి అంకితభావాన్ని గుర్తించిన ట్రస్ట్ ఒక్కొక్కరికి రూ.4,500 చొప్పున మొత్తం రూ.18వేల ఆర్థిక సహాయం అందించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ జెడ్పిటిసి గంట రాములు యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు మేకల మల్లేశం యాదవ్ హాజరయ్యారు. వాలంటీర్ల సేవలను వారు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సంద ర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు మారం తిరుపతి యాదవ్ మాట్లాడు తూ ప్రజా సేవలో వాలంటీర్లు చూపుతున్న అంకితభావం నిజంగా ప్రశంసనీయమని కొనియాడారు. సమాజానికి నిస్వార్థంగా సేవ చేస్తున్న వారికి తోడుగా నిలబడడం మనందరి బాధ్యత అన్నారు. వారి సేవలకు ప్రోత్సాహంగానే ఈ చిన్న సహాయాన్ని అందిం చామని పేర్కొన్నారు. భవి ష్యత్తులో కూడా సేవా కార్య క్రమాలను మరింత విస్తృతం గా, ముఖ్యంగా ఆరోగ్య, విద్యా రంగాల్లో కొనసాగించే సంక ల్పాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సహకరించి న గంట రాములు యాదవ్, మేకల మల్లేశం యాదవ్ తో పాటు సందనవేని రాజేందర్ యాదవ్, గొడుగు రాజకుమార్ యాదవ్ లకు ట్రస్ట్ తరపున ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి గొడుగు రాజ్ కుమార్ యాదవ్,ట్రస్టీలు బత్తిని లక్ష్మణ్ యాదవ్,మేకల కొమురయ్య యాదవ్, మల్లె త్తుల నాగరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎవరీ సుమంత్...

**హైదరాబాద్ పెన్ పవర్:**
ఎవరీ సుమంత్? ఒక మంత్రిని వివాదంలోకి లాగిన ఈ వ్యక్తి ఎవరు? కొండా సురేఖ మంత్రి పదవికి ఎసరు తెచ్చిన ఈ సుమంత్ పై వచ్చిన ఆరోపణలేంటి? ఎందుకు సుమంత్ కోసం పోలీసులు వెతుకుతున్నారు? ఏకంగా కొండా సురేఖ ఇంటికి పోలీసులు అర్ధరాత్రి ఎందుకు వచ్చారు? అన్న అనుమానాలు ఇవాళ సర్వత్రా నెలకొన్నాయి.తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలిలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా సుమంత్ పని చేస్తుండేవారు. కొండా సురేఖ అటవీ, దేవాదాయ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత, ఆ శాఖ నోట్ ద్వారా సుమంత్ మంత్రి వద్ద ఓఎస్డీ (ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ)గా చేరారు. మంత్రి రోజువారీ కార్యక్రమాలను ఓఎస్డీగా చూస్తుంటారు. అయితే, సుమంత్ పై వచ్చిన అవినీతి, బెదిరింపు ఆరోపణలు ఇప్పుడు తెలంగాణ వ్యాప్తంగా సంచలనంగా మారాయి.కొండా సురేఖ ఓఎస్డీగా పని చేస్తోన్న సుమంత్ పై ప్రధాన ఆరోపణ గన్ తో బెదిరించడం. హుజూర్ నగర్ నియోజకవర్గంలోని దక్కన్ సిమెంట్స్ కంపెనీ ప్రతినిధులను బెదిరించి డబ్బులు డిమాండ్ చేశారన్నది ప్రధాన ఆరోపణ. ఈ వ్యవహారం అంతా సీఎం రేవంత్ రెడ్డి సన్నిహితుడుగా పేరొందిన రోహిన్ రెడ్డి కార్యాలయంలో ఈ బెదిరింపు వ్యవహారం జరిగినట్లు ప్రచారం సాగుతోంది. అయితే, ఈ ఘటనపై నీటిపారుదల శాఖ మంత్రి
ఉత్తమ్ కుమార్ రెడ్డి సీఎంకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.ఈ గన్ బెదిరింపు వ్యవహారం సీఎం రేవంత్ రెడ్డి చెవిన పడటంతో, ఆయన ఆదేశాల మేరకు అంతర్గత విచారణ జరిపినట్లు సచివాలయ వర్గాలు చెబుతున్నాయి. ఇది నిజమని తేలడంతో, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలిలో పని చేస్తూ మంత్రి కొండా సురేఖ వద్ద డిప్యుటేషన్ లో ఓఎస్డీగా పని చేస్తున్న ఆయన్ను తక్షణ విధుల నుంచి ఉన్నతాధికారులు అక్టోబర్ 14వ తేదీన తప్పించారు. ఈ మేరకు ప్రభుత్వం జీవో జారీ చేసింది.ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు విచారణ చేపట్టారు. విధుల నుండి ప్రభుత్వం తొలగించగానే సుమంత్ అదృశ్యమయ్యారు. ఆయన ఆచూకీ తెలుసుకునేందుకు టాస్క్ ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగారు. అక్టోబర్ 15 అర్ధరాత్రి హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ లో ఉన్న మంత్రి కొండా సురేఖ నివాసంలో ఉన్నారని సమాచారం రావడంతో, టాస్క్ ఫోర్స్ పోలీసులు అక్కడకు చేరుకున్నారు. అయితే, ఆ సమయంలో కొండా సురేఖ కుమార్తె సుష్మిత పోలీసులను గేట్ వద్దే అడ్డుకుని
వాగ్వాదానికి దిగారు. వారెంట్ లేకుండా ఇంట్లోకి ఎలా వస్తారని నిలదీశారు. సుమంత్ అరెస్టుకు కారణాలేంటని ప్రశ్నించారు. ఇది జరుగుతుండగానే మంత్రి కొండా సురేఖ తన కారులో సుమంత్ ను ఎక్కించుకుని అక్కడి నుండి వెళ్లిపోయారని ప్రచారం సాగింది. దీంతో ఈ వ్యవహారం రాజకీయ మలుపు తిరిగింది. అసలు ఈ వ్యవహారంలో సీఎం పాత్ర ఉందని, ఆయనే గన్ పంపారని, సీఎం సన్నిహితుడు రోహన్ రెడ్డినే అడగాలంటూ సుష్మిత చేసిన ఆరోపణలతో ఈ వివాదం మరింత ముదిరింది. ఏది ఏమైనా, కొండా సురేఖ మాజీ ఓఎస్డీ వ్యవహారం ఇప్పుడు కొండా సురేఖ వేటుకు కారణం కానుందా? అన్న చర్చ సర్వత్రా సాగుతోంది.

# రహమత్ నగర్ లో కాంగ్రెస్ ముఖ్యనేతల భేటీ

**హైదరాబాద్ పెన్ పవర్:**రహమత్ నగర్ డివిజన్ లో కాంగ్రెస్ బూత్ స్థాయి ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రులు గడ్డం వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, ఎంపీ%ద%సికింద్రాబాద్ డిసిసి అధ్యక్షులు అనిల్ కుమార్ యాదవ్, తెలంగాణ రాష్ట్ర పిసిసి అధ్యక్షులు మహేష్ గౌడ్, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అజారుద్దీన్, రహిమత్ నగర్ కార్పొరేటర్ సిఎన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ పాల్గొన్నారు.

ఓట్ చోరీ పై సంతకాల సేకరణ లో భాగంగా ఏఐసీసీ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ,మంత్రి పొన్నం ప్రభాకర్ ,ఇతర ముఖ్య నేతలు సంతకాలు చేసారు. నేతలు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని బిఆర్ఎస్ ఎదురుకోలేకనే తప్పుడు ప్రచారం చేస్తుందని అన్నారు. రాబోయే ఉపఎన్నికలో ప్రతి బూత్ స్థాయిలో బలమైన కట్టుదిట్టమైన వ్యవస్థ ఏర్పాటుకు నిర్ణయాలు తీసుకున్నారు.. జూబ్లీహిల్స్ అభివృద్ధి కోసం, ప్రజల ఆశయాలను నెరవేర్చే నాయకుడు నవీన్ యాదవ్ ని గెలిపించేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.